సాక్షి ప్రకాశం

సోమవారం ၊ 8 ၊ జూలై ၊ 2024



తమ్ముడి దాడిలో అన్న మృతి

తాగి వచ్చి తల్లితో గొడవ పడుతున్నాడని క్షణికావేశంలో తమ్ముడు కర్రతో కొట్టడంతో అన్న తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో మృతి చెందాడు. - 8లో..



కారు ఢీకొని వ్యక్తి మృతి

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన కంభం మండలం జంగంగుంట్లలో ఆదివారం జరిగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం 35/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

ఒంగోలు: స్థానిక వైఎస్సార్ సీపీ నూతన జిల్లా కార్యాలయంలో మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 10.20 గంటలకు స్థానిక చర్చి సెంటర్ ఆవరణలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షుడు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు/ డైరెక్టర్లు, మహిళలు, వైఎస్సార్ సీపీ అభిమానులంతా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

18న నాగభైరవ సాహితీ పురస్కారాల ప్రదానం

ఒంగోలు మెట్రో: నాగభైరవ సాహిత్యపీఠం ఆధ్వర్యంలో ఈనెల 18న ఒంగోలులో నాగభైరవ సాహితీ పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగభైరవ సాహితీ పురస్కారం-2024 ప్రదానం చేసేందుకు లఘు కవితా ప్రక్రియలో రాసిన పుస్తకాలను ఆహ్వానించారు. వచ్చిన లఘుకవితా సంపుటాల్లో రూ.10 వేల మొదటి బహుమతికి ఏనుగు నరసింహారెడ్డి రాసిన 'పుల పూల వాన', రూ.5 వేల ద్వితీయ బహుమతికి డాక్టర్ వూటుకూరి వరప్రసాద్ రాసిన 'మణిపూసలు' పుస్తకాలు ఎంపికయ్యాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు నాగభైరవ సాహితీ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.

వల్లూరమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు




ప్రత్యేక అలంకరణలో ఉన్న వల్లూరమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజ, గోత్రనామార్చనలు, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు భారీగా మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వాహన పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈఓ రమేష్ ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకుడు ఉమాశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కరువు నేలపై అభివృద్ధి సంతకం

రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోక వెనుకబడిన జిల్లాల్లో ఒకటిగా కరువు కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్న ప్రకాశం జిల్లాలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అభివృద్ధి వెలుగులు విరజిమ్మాయి. కరువును పారదోలితేనే అభివృద్ధికి బీజం పడుతుందని నమ్మిన వైఎస్సార్ జలయజ్ఞంలో భాగంగా బృహత్తర ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. రిమ్స్‌తో మెరుగైన వైద్యాన్నీ పేదలకు చేరువచేశారు. నేడు వైఎస్సార్ జయంతి సందర్భంగా జిల్లాలో వైఎస్సార్ చేపట్టిన అభివృద్ధిపై ప్రత్యేక కథనం.

- జిల్లాపై వైఎస్సార్ చెరగని ముద్ర
- జిల్లా అభివృద్ధికి తండ్రీ, తనయులదీ ఒకే బాట
- సాగునీరు, తాగునీరు అందించేందుకు వెలిగొండ, గుండ్లకమ్మ పూర్తి
- మహానేత హయాంలోనే ఒంగోలు రిమ్స్ ఏర్పాటు
- పార్టీలతో ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాల అమలు
- నేడు వైఎస్సార్ జయంతి



గుండ్లకమ్మ ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా ప్రాజెక్టు వద్ద వైఎస్సార్ (ఫైల్)

మార్కాపురం: 2004కు పూర్వం జిల్లాలో అభివృద్ధి లేక వెనుకబడిన ప్రాంతంగా ఉండేది. చెప్పుకోదగిన నీటి ప్రాజెక్టులు, వైద్యశాలలు లేకపోవడంతో రైతులు వర్షాధారంపైనే ఆధారపడ్డారు. వైద్యం కోసం అటు గుంటూరు.. ఇటు కర్నూలు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో 2004లో ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన వెంటనే వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. రామతీర్థం, గుండ్లకమ్మ ప్రాజెక్టులనూ ప్రారంభించి పూర్తి చేశారు. ఒంగోలులో రిమ్స్ వైద్య కళాశాలను ఏర్పాటు చేసి అత్యాధునిక వైద్యసేవలను జిల్లా ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

తండ్రి వైఎస్సార్ బాటలో నడుస్తూ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వివిధ అభివృద్ధి పనులు చేసి జిల్లా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. తన ఐదేళ్ల కాలంలో తండ్రి ఆశయాలను కొనసాగించారు. జిల్లాకే తలమానికంగా మారిన వెలిగొండ ప్రాజెక్టును ఈ ఏడాది మార్చి 6న జాతికి అంకితం చేసి దశాబ్దాల కలను నెరవేర్చారు. ఆసియాలోనే అత్యంత పొడవైన సొరంగ మార్గాలను పూర్తిచేసి చరిత్ర సృష్టించారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చారు. దీంతో ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లోని 4.47 లక్షల ఎకరాల్లో సాగునీటి సరఫరా, మొత్తం 30 మండలాల్లోని 15.20 లక్షల మందికి తాగునీటిని అందించే అతిపెద్ద ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన ఘనత కూడా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కింది. నాడు తండ్రి ప్రారంభించిన పనులను తనయుడు జగన్ పూర్తిచేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. 2014 నుంచి 2019 వరకూ టీడీపీ ప్రభుత్వంలో పురోగతిలేని వెలిగొండను పూర్తిచేసి తనదైన ముద్ర వేసుకున్నారు. కరోనా సమయంలో కూడా ప్రాజెక్టు పనులు చేయించడంతో త్వరితగతిన పూర్తయింది.

తండ్రీ తనయుల పాలనలో అభివృద్ధి ఇలా...

పశ్చిమ ప్రకాశం ప్రజలకు వైద్యసేవలు అందని ద్రాక్షలాగా మారిన నేపథ్యంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం కాగానే రూ.475 కోట్లతో మెడికల్ కళాశాల మంజూరు చేయడంతో పాటు నిధులు కేటాయించడంతో ఈ ఏడాది నుంచి ఎంబీబీఎస్ అడ్మిషన్లు కూడా ప్రారంభం కానున్నాయి. మార్కాపురంలోని జిల్లా వైద్యశాలను జీజీహెచ్‌గా మార్చి సుమారు రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేయడంతోపాటు నాటి టీడీపీ ప్రభుత్వంలో 9 మందికే పరిమితమైన వైద్యుల పోస్టులను నేడు 72కు పెంచారు.

- దోర్నాలలో సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలను కూడా మంజూరుచేసి నిధులు కేటాయించారు.
- జిల్లాలో రూ.400 కోట్లతో సాగర్ కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టడంతో జిల్లాలోని త్రిపురాంతకం, పుల్లలచెరువు, దర్శి, చీమకుర్తి, సంతనూతలపాడు, యర్రగొండపాలెం, పర్చూరు, అద్దంకి తదితర ప్రాంతాల్లోని 4.50 లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టు సస్యశ్యామలమైంది.
- మార్కాపురం నియోజకవర్గంలో ఐదేళ్లలో సుమారు రూ.1500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరిగాయి.
- కనిగిరి నియోజకవర్గంలో రూ.175 కోట్లతో రక్షిత మంచినీటి పథకాన్ని మంజూరుచేసి ఫ్లోరైడ్ వాటర్ నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకున్నారు.
- మార్కాపురం మండలంలోని గొట్టిపడియ వద్ద సుమారు రూ.1200 కోట్లతో ఇన్‌టెక్‌వెల్ ట్యాంకును కడుతున్నారు. వెలిగొండ నీటిని దీనికి కేటాయించి ఈ ట్యాంకు నుంచి మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, యర్రగొండపాలెం తదితర నియోజకవర్గాల్లోని సుమారు 500 గ్రామాలకు పైగా ప్రజలకు వెలిగొండ నీటిని అందించనున్నారు.
- గిద్దలూరు నియోజకవర్గంలో రూ.12 కోట్లతో బైరేనిగుండాల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. రూ.22 కోట్లతో రామన్నకతువ నిర్మించారు.
- తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వైఎస్ జగన్ కొనసాగించారు. జిల్లాలో 63,346 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు సుమారు రూ.30 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారు. దీంతోపాటు 300 మంది విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలో కార్పొరేట్ తరహా విద్యను అందించారు.
- వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2004 లో అధికారంలోకి రాగానే ఉచిత విద్యుత్‌పై సంతకం చేశారు. 2004 మే నెలకు ముందు జిల్లాలో 63,559 మంది రైతుల కరెంటు బకాయిలను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రద్దు చేశారు. అప్పటికే జిల్లా వ్యాప్తంగా 71,321 మంది రైతులకు ఉచిత విద్యుత్ అందించారు.
- పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో మొత్తం వైఎస్ జగన్ హయాంలో 12,868 గృహాలు మంజూరుచేయగా సుమారు 9 వేల గృహాలు పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి.

గుండ్లకమ్మతో సస్యశ్యామలం



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వృథాగా పోతున్న నీటిని నిల్వచేసి ప్రాజెక్టు కడితే రైతులకు ఉపయోగపడుతుందని భావించి గుండ్లకమ్మ ప్రాజెక్టు కోసం అప్పట్లోనే రూ.543.43 కోట్లు కేటాయించి జలయజ్ఞంలో భాగంగా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. 9 మండలాల పరిధిలోని 84 వేల ఎకరాలకు సాగునీటితోపాటు ఒంగోలుతోపాటు చుట్టుపక్కల 43 గ్రామాల పరిధిలోని 2.56 లక్షల మంది ప్రజలకు తాగునీటిని కూడా అందించారు. 2008 నవంబరు 24న జాతికి అంకితం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చివరి భూములకు కూడా సాగునీరు అందించేందుకు రూ.100 కోట్లు మంజూరు చేయించి కాలువలను ఆధునికీకరించారు.

ఒంగోలు రిమ్స్ తలమానికం



ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ప్రజలకు వైద్య సదుపాయాలు లేక ఏ చిన్నపాటి రోగం వచ్చినా, సర్జరీ చేయాలన్నా అటు గుంటూరు, ఇటు కర్నూలు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చేది. దీంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మెడికల్ కళాశాల నిర్మాణం కోసం రూ.250 కోట్లు కేటాయిస్తూ రిమ్స్‌ను ఏర్పాటు చేశారు. ఆ వైద్యశాలను ప్రస్తుతం జీజీహెచ్‌గా మార్చారు. ఈ వైద్యశాల అభివృద్ధి కోసం అదనంగా రూ.170 కోట్లు మంజూరు చేశారు. అత్యాధునిక వైద్యసౌకర్యాల కోసం మరో రూ.100 కోట్లతో జీజీహెచ్‌లో అభివృద్ధి పనులు వైఎస్ జగన్ ప్రభుత్వంలో చేపట్టారు.




వెలిగొండ ప్రాజెక్టు టన్నల్‌ను పరిశీలిస్తున్న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)



రాయవరం వద్ద నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ



మార్కాపురం జీజీహెచ్ వైద్యశాల



గొట్టిపడియ వద్ద నిర్మాణంలో ఉన్న ఇన్‌టెక్‌వెల్ ట్యాంకు

కంభంలో గంజాయి జోరు

- జోరుగా గంజాయి వ్యాపారం
- మత్తు మాత్రలు కూల్ డ్రింక్స్‌లో కలుపుకొని తాగుతున్న యువకులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న లాడ్జిలు
- రంగంలోకి దిగిన పోలీసులు



గంజాయి



సిగరెట్లలోకి గంజాయిని నింపుతున్న దృశ్యం

కంభం: ఇప్పటి వరకు గుట్కా, మట్కా, పేకాట లాంటి వ్యాపారాలు జోరుగా సాగుతున్న కంభం పట్టణంలో కొంతకాలంగా గంజాయి వ్యాపారం ఊపందుకుంది. చెడు వ్యసనాలకు బానిసలైన కొంతమంది యువకులు ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తెప్పించి ఇక్కడ విక్రయిస్తున్నారు. గంజాయి మత్తు సరిపోలేదనుకున్నారో ఏమో లేక అంతకు మించి మత్తు కోరుకున్నారో.. ఇటీవల కాలంలో కొత్త తంతు మొదలు పెట్టారు. మెడికల్ షాపుల్లో లభించే జోల్‌ఫ్రెష్ (మత్తు మందులు) ట్యాబ్లెట్స్, ఇతర మత్తు మాత్రలు కొనుగోలు చేసి వాటిని కూల్‌డ్రింక్స్‌లో కలుపుకొని తాగి మత్తులో తూగుతూ ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారు. కొందరైతే వీటిని పొడిగా చేసుకొని వేడి చేసి పీల్చుతూ డ్రగ్స్ అనుభూతిని పొందుతున్నట్లు తెలుస్తోంది. వీటి ద్వారా వచ్చే మత్తు రెండు రోజుల వరకు ఉంటుందని చెబుతున్నారు. గిద్దలూరు, కనిగిరి, నంద్యాల, ఇతర ప్రాంతాల నుంచి తెప్పించిన గంజాయిని నక్కలగండి తూము వద్ద రైల్వే బ్రిడ్జి కింద స్థావరంగా ఏర్పాటు చేసుకొని అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తున్నట్లు సమాచారం.

నిబంధనలు పాటించని మెడికల్ షాపులు

మత్తుమందులు, నిద్రమాత్రలు విక్రయించాలంటే కచ్చితంగా డాక్టర్ రిఫర్ చేస్తేనే ఇవ్వాల్సి ఉండగా మెడికల్ షాపుల యజమానులు డబ్బులకు ఆశపడి నిబంధనలు ఉల్లంఘించి మత్తు మందులు విక్రయిస్తూ పరోక్షంగా వారికి సహకరిస్తూ లబ్ధిపొందుతున్నారు. తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాల్సిన ఔషధ నియంత్రణ అధికారుల జాడేలేకపోవడంతో దుకాణదారుల ఇష్టారాజ్యమైంది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పలు లాడ్జిలు

పట్టణంలో హైవే రోడ్డులో ఉన్న ఓ లాడ్జిలో ఆదివారం గంజాయితో పలువురు యువకులు పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది. ఇంకా పలు లాడ్జిల్లో అసాంఘిక కార్యక్రమాలు, పేకాట జోరుగా సాగుతున్నట్లు సమాచారం. లాడ్జిల్లో రూములు అద్దెకు తీసుకొని మద్యం తాగి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. గత నెలలో పట్టణంలోని ఓ లాడ్జిలో యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకొని ఫర్నిచర్ ధ్వంసం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆదివారం లాడ్జిల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు.

కూపీ లాగుతున్న పోలీసులు

మార్కాపురం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టిన పోలీసులు అతని ద్వారా వచ్చిన సమాచారం మేరకు డ్రగ్స్ అధికారులు, సెబ్ అధికారులతో కలిసి ఆదివారం కంభంలో రెండు మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. బస్టాండు సమీపంలో ఉన్న మహేశ్వరి మెడికల్ షాపులో ఇద్దరు యువకులు మత్తుకు సంబంధించిన మాత్రలు తీసుకుంటూ పట్టుబడినట్లు తెలిసింది. వారిని అదుపులోకి తీసుకొని విచారంగా హైవేపై ఉన్న రెడ్డి లాడ్జిలో మరో ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి మత్తు మాత్రలు, గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీసులు మార్కాపురానికి చెందిన ఇద్దరు, కంభం పట్టణానికి చెందిన ముగ్గురు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి మూడు గంజాయి ప్యాకెట్లు, మత్తుకు సంబంధించిన ట్యాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. సాయంత్రం యర్రగొండపాలెంలో ఒకరిని అదుపులోకి తీసుకొని 330 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి గంజాయి వ్యాపారాన్ని ఈ ప్రాంతంలో నిర్మూలించి యువత పెడదారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మెడికల్‌షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

మెగా వైద్యశిబిరంలో 1505 మందికి వైద్యసేవలు



రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రోగులు



శిబిరంలో పాల్గొన్న రోగులు

ఒంగోలు సెంట్రల్: దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జి.బి.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైంది. తొమ్మిదేళ్లుగా ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహిస్తూ జిల్లాలోని బీపీ, షుగర్స్, ఫిట్స్, పక్షవాతం, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి తక్కువ ధరలకు మెడిసిన్ సైతం అందిస్తుండటంతో రోగుల నుంచి శిబిరానికి విశేష ఆదరణ లభిస్తుంది. వేకువజాము నుంచే రోగులు పాఠశాల ఆవరణలో బారులు తీరారు. వైద్యులు గోపాలం శ్రీమన్నారాయణ, డాక్టర్ చాపల వంశీక్రిష్ణ, డాక్టర్ బీ హరిబాబు, డాక్టర్ జాన్ రిచర్డ్స్, డాక్టర్ జీ చైతన్య, డాక్టర్ ఎం శరత్, డాక్టర్ రవితేజ, డాక్టర్ ఎస్ ధీరజ్‌బాబు, డాక్టర్ పొన్నం సత్యనారాయణ తదితర వైద్యులు పాల్గొని 1505 మంది రోగులను పరిశీలించి తగిన సూచనలు చేసి, మందులు సిఫార్సు చేశారు. ఓపీ, టెక్నికల్ విభాగం, ఫార్మసీ, రిజిస్ట్రేషన్, కౌన్సిలింగ్ సర్వీస్ విభాగాల్లో 120 మంది వలంటీర్లు సేవలు అందించారు. వైద్య సేవలు నిర్వహణకు చీమకుర్తి జవహర్ వైద్యశాల చైర్మన్ డాక్టర్ బీ జవహర్, ఢాకా సుబ్బారెడ్డిలు చేరో పది వేల చొప్పున విరాళం అందించారు. వారికి నిర్వాహక కమిటీ, మెడికల్ క్యాంప్ కన్వీనర్ మాదాల వెంకట రావు ధన్యవాదాలు తెలిపారు. తదుపరి వైద్యశిబిరం సెప్టెంబర్ ఒకటిన నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా మాదిగల ఆత్మగౌరవ దినోత్సవం

ఒంగోలు: మాదిగల ఆత్మగౌరవ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వీహెచ్‌పీఎస్, ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్‌సీ ఆధ్వర్యంలో స్థానిక చర్చిసెంటర్ నుంచి కోలాస్ హోటల్ వరకు ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు తోరటి ఆనంద్ మాదిగ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద జెండా ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల లక్ష్యం ఎస్సీ వర్గీకరణ అని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన మాట నిలబెట్టేకునేలా ముందుకెళ్లాలన్నారు. ఆ లక్ష్యం కోసం మాదిగ జాతి వెయ్యి కళ్లతో ఎదురుచూస్తుందన్న విషయాన్ని గుర్తుచేస్తూ అతి త్వరలోనే వర్గీకరణ సాధించుకుని తీరుతామన్నారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు బొంత ఏసుదాస్ మాదిగ, ఒంగోలు నియోజకవర్గ ఎంఎస్‌సీ ఇన్‌చార్జి తిరువీధుల బాబు మాదిగ, వీహెచ్‌పీఎస్ జాతీయ నాయకులు ఆనాల సురేష్, జొన్న బాలాజీ, షేక్ కలాం, పద్మ, యశోద, సర్వేపల్లి రవిరాజు మాదిగ, తేళ్ల జాలరావు మాదిగ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు తోరటి ఆనంద్ మాదిగ

క్లుప్తంగా

నేడు మార్కాపురంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఒంగోలు సెంట్రల్: కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో మార్కాపురంలో ఈ నెల 8న ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. మార్కాపురం ఏరియా హాస్పిటల్ దగ్గర కంభం రోడ్డులో ఉన్న శ్రీనివాస కల్యాణ మండపంలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో అధికారులు పాల్గొంటారని వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీస్ కార్యాలయంలో..

ఒంగోలు సెంట్రల్: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నిషేధిత మందులు విక్రయిస్తే చర్యలు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్

కంభం: పట్టణంలోని రెండు మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించినట్లు మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు, ఒంగోలు ఔషధ నియంత్రణ అధికారి సంధ్య తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామని బస్టాండులోని మహేశ్వరీ మెడికల్ షాపులో డాక్టరు చీటి లేకుండా మత్తు మాత్రలు విక్రయిస్తున్నారని తెలిపారు. వాటికి సంబంధించిన బిల్లులు కూడా లేనట్లు గుర్తించామని చెప్పారు. సంబంధిత మెడికల్ షాపుకు షోకాజ్ నోటీసు ఇచ్చామని నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పిస్తామని వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిషేధిత మందులు డాక్టర్ రెఫరెన్స్ లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆడపిల్ల..ఆత్మరక్షణ

ఆడపిల్ల అంటే అబల కాదు..ఎవరైనా అడ్డొస్తే రుద్రమదేవిగా మారాలి. ఎవరో వస్తారని ఎదురుచూడకుండా ఎదురుతిరిగి పోరాడాలి. అందుకు ఆత్మరక్షణ ఎంతో ముఖ్యం. ఈ లక్ష్యంతో ఏర్పాటైందే రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమి. రెండు తెలుగు రాష్ట్రాల్లో మహిళలకు ఆత్మరక్షణ విద్య నేర్పించాలన్న ఉన్నత లక్ష్యంతో అంతర్జాతీయ స్థాయిలో కరాటేలో బ్లాక్‌బెల్ట్ సిక్స్ డాన్‌గా మూడు సార్లు పేరు సంపాదించిన నర్రా లక్ష్మీసామ్రాజ్యం ముందడుగు వేసింది. వందలాది మంది మహిళలకు ఆత్మరక్షణలో శిక్షణ ఇచ్చి వారిని రుద్రమదేవిలుగా తీర్చిదిద్దుతున్నారు.

- ప్రతి మహిళ రుద్రమదేవిగా ఎదగాలి
- కరాటే బ్లాక్ బెల్ట్ సిక్స్ డాన్ లక్ష్మీసామ్రాజ్యం
- రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ద్వారా ఆత్మరక్షణలో శిక్షణ
- జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు

కొనకనమిట్ల: మహిళల రక్షణ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఆడవాళ్లపై నిత్యం వేధింపులే. సమాజంలో నేర స్వభావం పెరుగుతున్న కొద్దీ అది స్త్రీల జీవితాలపై ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితుల్లో పిల్లలకు ఆత్మరక్షణ విద్య అవసరం. ఈ నేపథ్యంలో పుట్టుకొచ్చింది రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమి.. దాని ద్వారా మహిళలను తీర్చిదిద్దుతున్నారు నర్రా లక్ష్మీసామ్రాజ్యం.

ఆపద సమయంలో ఆత్మస్థైర్యంతో..

విద్యార్థినులు, మహిళలు, ఉద్యోగినులు ఆపద సమయంలో ఆందోళన చెందకుండా తమను తాము రక్షించుకోవాలి. దానిలో భాగంగా రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమి నిర్వాహకులు లక్ష్మీసామ్రాజ్యం 15 అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. శరీరంలోని శక్తువ, హృదయంలోని కరుణ పెంపొందించుకుని, సామాజిక శ్రేయస్సుకు హాని తలపెట్టే శక్తుల్ని, వ్యక్తిగత హింసకు పాల్పడే వారిని శిక్షించేందుకు కరాటే ఉపకరిస్తుంది. ఆరోగ్యంతో పాటు శారీరక ధారుఢ్యం, మానసిక వికాసంతో పాటు మనోధైర్యాన్ని కలుగజేసే అద్భుతమైన శక్తి కరాటేకు ఉందంటున్నారు.



అమెరికాలో గోల్డ్ మెడల్ అందుకుంటూ



నార్త్ అమెరికాలో..

అవార్డులు ..రివార్డులు

లక్ష్మీసామ్రాజ్యం కరాటే ప్రతాపానికి జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు పలు విజయాలు సొంతం చేసుకొని సిక్స్ డాన్ (కాయ్) మూడు సార్లు సాధించింది.. ఇటీవల నార్త్ అమెరికాలో లాస్ ఇకాస్‌లో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో ఓపెన్ విభాగంలో 17 రాష్ట్రాలతో పోటీపడి గోల్డ్ మెడల్ సాధించింది. 2001లో మలేసియాకు చెందిన గ్రాండ్‌మాస్టర్ రికీవాంగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్‌పోటీలలో బ్లాక్‌బెల్టును సొంతం చేసుకుంది. 2003లో శ్రీలంకలోని మాతలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో బంగారు పతకం, ముంబై, విజయవాడలలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు.

మహిళా పోలీసులకు శిక్షణ..



మహిళా పోలీసులకు కరాటేలో శిక్షణ ఇస్తూ..

రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ద్వారా ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో మహిళా పోలీసులతో పాటు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు చేయూతనిస్తే గ్రామీణ ప్రాంతాల్లో కూడా మహిళలకు ఆత్మరక్షణలో శిక్షణ ఇవ్వాలన్నదే లక్ష్యంగా చెబుతున్నారు లక్ష్మీ సామ్రాజ్యం. గతేడాది ప్రకాశం జిల్లాలో 385 ప్రభుత్వ పాఠశాలల్లో ఎడ్యుకేషన్ కమిషనర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.



కరాటే సిక్స్‌డాన్ లక్ష్మీ సామ్రాజ్యం



హీరో సుమన్ నుంచి ప్రసంసాపత్రం

తమ్ముడి దాడిలో అన్న మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ షమీఉల్లా

- రాజంపల్లిలో ఘటన
- కేసు నమోదు చేసి పోలీసుల దర్యాప్తు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సుమన్

దర్శి: తాగి వచ్చి తల్లితో గొడవ పడుతున్నాడని తమ్ముడు కర్రతో క్షణికావేశంలో కొట్టగా అన్న రావులపల్లి ప్రసాద్(37) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని రాజంపల్లిలో జరిగింది. సీఐ షమీఉల్లా తెలిపిన వివరాల మేరకు..ఆదివారం రాత్రి ప్రసాద్ మద్యం సేవించి వచ్చి తల్లితో గొడవ పడ్డారు. దీంతో మృతుని తమ్ముడు బాలరాజు మూడు సార్లు కర్రతో కొట్టడంతో ప్రసాద్‌కు రక్త గాయాలయ్యాయి. దీంతో బంధువులు చికిత్స నిమిత్తం ఒంగోలు తీసుకువెళ్లారు. ఒంగోలులో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున ప్రసాద్ మృతి చెందారు. ఈ విషయంపై మృతుని చెల్లి ఫిర్యాదు చేయగా ఎస్సై సుమన్ కేసు నమోదు చేశారు. సీఐ షమీఉల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాలివానకు నేలకొరిగిన చెట్లు

గిద్దలూరు రూరల్: పట్టణంలో ఆదివారం కురిసిన అకాల వర్షాలకు రాజానగర్ ప్రధాన రహదారిలో వేపచెట్టు నేలకొరిగింది. చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అకాల వర్షానికి తోడు డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కవీధి, కొట్టివారి వీధితో పాటుగా నల్లబండ బజారులలో వీధులు జలమయమయ్యాయి. అటవీశాఖ కార్యాలయం, నగరపంచాయతీ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం ముందు భాగంలో వర్షం నీరు నిలిచిపోయాయి.



రాజానగర్‌లో రోడ్డుకు అడ్డంగా పడ్డ వేపచెట్టు

వాసవీ క్లబ్‌కు అన్నివేళలా సహకారం



మాట్లాడుతున్న మాజీమంత్రి శిద్దా రాఘవరావు

ఒంగోలు:

ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, ఈ సంస్థకు ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తామని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. స్థానిక సాయి ఐటీఏ ఫంక్షన్‌హాలులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ ఒక నిబద్ధత కూడిన సంస్థ అన్నారు. దేశవ్యాప్తంగా అనేక క్లబ్బులు నిర్వహిస్తుందన్నారు. ఈ సంస్థ ప్రతినిధులు, సభ్యులతో తమకు ఉన్న అనుబంధాన్ని, పరిచయాన్ని గుర్తు చేసుకున్నారు. ఇటువంటి క్లబ్‌కు తప్పకుండా తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తామన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ అధ్యక్షుడు రవిచంద్ర, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి నాగభూషణం, కోశాధికారి శిద్దా సూర్యప్రకాశరావులు మాట్లాడుతూ వాసవీ క్లబ్‌కు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. 5 రాష్ట్రాలకు చెందిన 1200 వాసవీ క్లబ్‌లకు చెందిన ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనడం ఆనందకరంగా ఉందని, వాసవీ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

కంభం: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని జంగంగుంట్ల గ్రామ సమీపంలో అనంతపురం- అమరావతి హైవేరోడ్డుపై ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే ..జంగంగుంట్ల గ్రామానికి చెందిన దేశిసుబ్బారెడ్డి(49) అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై పొలానికి వెళ్తున్న సమయంలో జంగంగుంట్ల గ్రామంలోని నూతన సచివాలయ భవనం సమీపంలో హైవేరోడ్డుపై మార్కాపురం వైపు నుంచి వస్తున్న కారుఢీకొట్టడంతో సుబ్బారెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు ఒంగోలు తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.



సంఘటనా స్థలంలో తీవ్ర గాయాలతో సుబ్బారెడ్డి

అతిధోరణులను విడనాడాలి



నాగసూరి దంపతులకు పురస్కారం అందిస్తున్న పుట్టంరాజు దంపతులు

- ప్రముఖ సాహితీవేత్త నాగసూరి
- పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ ట్రస్ట్ పక్షాన పురస్కారం అందజేత

అద్దంకి: మీడియా రంగం అతిధోరణులను విడనాడి సమాజ హితంగా కార్యక్రమాలు రూపొందించాలని ప్రముఖ సాహితీవేత్త మాధ్యమాల (పత్రికా) విశ్లేషకుడు రచయిత నాగసూరి వేణుగోపాల్ అన్నారు. స్థానిక శ్రీనివాసా ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ సాహితీ పురస్కార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సభకు పద్యకవి డీవీఎం సత్యనారాయణ అధ్యక్షత వహించారు. నంబూరి బాలభార్గవి ప్రార్థనా గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. లక్కరాజు శ్రీనివాసరావు సభాహ్వానం పలికారు. పురస్కార గ్రహీత పరిచయాన్ని నంబూరి హనుమంతరావు సభికులకు వినిపించారు. ఈ సందర్భంగా నాగసూరి వేణుగోపాల్ బహుముఖ ప్రజ్ఞాశాలి, నిత్య చైతన్యానికి చిరునామాగా నిలిచాడని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసులు అన్నారు. అక్షర తుణీరం నాగసూరి అని కొనియాడారు. పెద్దగా వెలుగు చూడని గ్రంథాలను వెలికి తీసి వాటిని ఈ నాటి తరానికి అందేలా చేసిన సాహిత్యవేత్త నాగసూరి వేణుగోపాల్ అన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ విజ్ఞాన సర్వస్వం నాగసూరి వేణుగోపాల్ అన్నారు. తన వాక్పటిమ, ధారాళ ప్రసంగంతో పూస గుచ్చినట్లు విషయాన్ని తెలియజేయడంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. డాక్టర్ యూ దేవపాలన మాట్లాడుతూ సాహితీ రంగంలో ఓ ఉవ్వెత్తున ఎగిసిన కెరటం నాగసూరి అన్నారు. ఆయన 80కి పైగా పుస్తకాలను రాయడంతోపాటు, రెండు పదుల సంఖ్యలో పుస్తకాలకు పైగా సంపాదకత్వం వహించారని గుర్తు చేశారు. వివిధ పత్రికా మాధ్యమాలను విశ్లేషించడంతోపాటు, విద్యార్థుల పాఠ్యాంశాలను రచించారని గుర్తు చేశారు. అనంతరం నాగసూరి వేణుగోపాల్ దంపతులను పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ ట్రస్ట్ తరఫున శ్రీరామచంద్రమూర్తి, శైలజ సాహిత్య పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. తరువాత నాగసూరి హనుమత్ ప్రసాద్, నాగసూరి వెంకట సుబ్బారావు, నాగసూరి శివప్రసాద్, చుండూరి మురళీ సుధాకరరావు, వామరాజు వెంకటేశ్వరరావు, చినన మురళీ కృష్ణ, మంచా సుబ్బారావు, కారుమంచి రమణ, కూరపాటి రామకోటేశ్వరరావు, సాహితీ మిత్రమండలి సభ్యుల పక్షాన రోటరీ క్లబ్, అద్దంకి, చిలకలూరిపేట, మార్టేళ్ల నుంచి వచ్చిన నాగసూరి వంశజులు పురస్కార గ్రహీతను సత్కరించారు. కార్యక్రమంలో సాహిత్యవేత్తలు గాడేపల్లి దివాకరదత్తు, అన్నంనేని వెంకట్రావు, ఆర్‌వీ రాఘవరావు, పొన్నూరి శ్రీనివాసులు, జీ హరనాథ్‌బాబు నాగసూరి గురించి ప్రసంగించారు. సాహిత్యాభిమానులు నిమ్మరాజు నాగేశ్వరరావు, ధేనువకొండ సుబ్బారావు, అంగలకుర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్స్ డేను జయప్రదం చేయండి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి
- సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాలం సుబ్బారావు, రమేష్

ఒంగోలు సెంట్రల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 10న దేశ వ్యాప్త డిమాండ్స్ డేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం రమేష్‌లు కోరారు. బీజేపీ నాయకత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ అమలుకు పూనుకుందన్నారు. లేబర్ కోడ్స్ అమలైతే కార్మికులు బేరసారలాడే హక్కులు కోల్పోయి యజమానుల కింద బానిసలుగా పనిచేయాల్సి వస్తుందన్నారు. పీఎఫ్ సకాలంలో చెల్లించకుంటే యజమానులపై విధించే పెనాల్టీని 25 శాతం నుంచి 5 శాతానికి తగ్గించి తన కార్పొరేట్ ప్రభుభక్తిని చాటుకుందన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించలేదన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయకుండా రాష్ట్రాల మీదకు నెట్టి కేంద్రం చోద్యం చూస్తుందన్నారు. మరో వైపు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఎన్నికల్లో కార్మికులు, ఉద్యోగాలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఉన్న ఉద్యోగాలను ఊడబెరికే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుందన్నారు. మధ్యాహ్న భోజన పథకం, స్కూల్ స్వీపర్స్, వీఓఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశ, అంగన్ వాడీ, మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగులు స్వచ్ఛందంగా తప్పుకోవాలని ఒత్తిళ్లు తీసుకువస్తున్నారన్నారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన పదోన్నతులు వెనక్కి తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులపై ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెస్తున్నారన్నారు. క్లాప్ మిత్ర, ప్రకృతి వ్యవసాయం, సమగ్ర శిక్ష ఉద్యోగులకు జీతాలు అందలేదని, అయినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగ, కార్మిక, వ్యతిరేక విధానాలు మానుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న నిర్వహించే నిరసనల్లో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.